# సాక్షి మహబూబాబాద్

సోమవారం । 11 । మార్చి । 2024






**వరప్రదాయిని ఫాతిమామాత**

ఏసుక్రీస్తు తల్లిగా ఫాతిమామాత భక్తుల వరప్రదాయినిగా గ్రేటర్ వరంగల్‌లో కాజీపేట ఫాతిమానగర్‌లోని కేథడ్రల్ చర్చిలో విరాజిల్లుతోంది.

- 8లో▸



**టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేశాం**

కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని రాష్ట్ర మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

$39.3^0$ / $22.5^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు తెప్పోత్సవం

**కురవి:** మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు(సోమవారం) కురవి పెద్ద చెరువు వద్ద తెప్పోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

### ఘనంగా సూర్య నమస్కార పూజలు



**కురవి:** మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో గ్రామ, ఆలయ అభివృద్ధిని కాంక్షిస్తూ ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యాపకులు పాపయ్యశాస్త్రి సమక్షంలో ఆలయ మండపంలో సూర్య నమస్కార పూజలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి దంపతులు, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, ఉప్పలయ్య, భిక్షపతి, శక్రు, గుగులోత్ సోమ్లా, భూక్య భక్షా, దొంగల జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు వద్దుల సురేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

### రైల్వే స్టేషన్‌లో పోలీసుల బందోబస్తు



**డోర్నకల్:** జిల్లా పరిధిలోని డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆర్‌పీఎఫ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఢిల్లీలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఆందోళనలో రైతు చనిపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం రైల్‌రోకో కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద మోహరించిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

### కురవి జాతర ఆదాయం రూ.3,01,000

**నెహ్రూసెంటర్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కురవి జాతరకు ప్రత్యేక బస్సుల ద్వారా మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు రూ.3,01,000 ఆదాయం సమకూరిందని డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి 17ప్రత్యేక బస్సులు, 176 ట్రిప్పులు, 5056 కిలోమీటర్లు తిరిగి 12,721మంది భక్తులను సురక్షితంగా చేరవేయడం జరిగిందన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



**కేసముద్రం:** త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆదివారం పరిశీలించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన బందోబస్తుపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్ ఉన్నారు.

### రుద్రేశ్వరుడికి మహాన్నపూజ



**హన్మకొండ కల్చరల్ :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరస్వామి వారికి మహా అన్న పూజ నిర్వహించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి నిత్యపూజలు, రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. దాతలు విజయ్‌మిశ్రా, సునీతామిశ్రా సౌజన్యంతో మిర్యాలపొడి మిళితంచేసిన 51 కిలోల పెరుగన్నంతో మహాశివలింగాన్ని అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో రుద్రేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు గరిగె అశోక్, కట్ల రాజు, చందు, రవి, శ్రీను తదితరులు సేవలందించారు. ఆలయ ఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం ఆంజనేయస్వామి వారికి చందనోత్సవం, ఆకుపూజ, రుద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

## ఆరు నెలలుగా జీతాలు రాక జీపీ కార్మికుల అవస్థలు

- చిన్న పంచాయతీల పరిస్థితి దారుణం
- పెండింగ్‌లో ట్రాక్టర్ల ఈఎంఐ, కరెంట్ బిల్లులు
- రెండు నెలలుగా విడుదల కాని 15వ ఆర్థిక సంఘం నిధులు

నెల్లికుదురు మండలంలోని చిన్న నాగారం జీపీ కార్యాలయం







# వేతన వెతలు

**మహబూబాబాద్ :** గ్రామపంచాయతీలను నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో జీపీ కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. చివరికి ట్రాక్టర్ల ఈఎంఐ, కరెంట్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఫండ్‌లేక పంచాయతీ కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు. స్పెషల్ ఆఫీసర్లు అదనపు బాధ్యతగానే భావించి గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. అయితే పంచాయతీ కార్యదర్శులతో పాటు ప్రత్యేకాధికారులకు నేటికీ డిజిటల్ టోకెన్ ఇవ్వకపోవడంతో గ్రామాల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

**జిల్లాలో 461 జీపీలు..**

జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉన్నాయి. సీనియర్, జూనియర్ పంచాయతీలు కార్యదర్శులు కలిసి 452 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 9చోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా జనాభా ప్రాతిపదికన జీపీ కార్మికులను నియమించారు. 400 నుంచి 500 జనాభాకు ఒక జీపీ కార్మికుడు పని చేస్తున్నాడు. ఇలా జిల్లాలో సుమారు 1,800 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వారు పారిశుద్ధ్య పనులు, రోడ్లు శుభ్రం చేయడం, వాటర్ సప్లై, వీధి దీపాల నిర్వహణతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలలను శుభ్రం చేస్తున్నారు. కాగా నెలకు రూ.9,500 వేతనం ఇస్తున్నారు. అయితే ఆరు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉడడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

**అందని డిజిటల్ టోకెన్లు..**

గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది జనవరి 31తో ముగిసిన విషయం విదితయే. కాగా ఫిబ్రవరి 1నుంచి ప్రత్యేకారులను నియమించారు. పంచాయతీ కార్యదర్శులకు స్పెషల్ ఆఫీసర్లుకు కలిపి చెక్ పవర్ ఇచ్చారు. కానీ నేటి వరకు అధికారులకు డిజిటల్ టోకెన్లు ఇవ్వలేదు. టోకెన్ కీలు వచ్చాయని మ్యాపింగ్ ప్రాసెస్ జరుగుతుందని చెబుతున్నారు. స్పెషల్ ఆఫీసర్లు వారికి ఉన్న బాధ్యతలతోనే సతమతమవుతుంటే.. అదనపు బాధ్యతలపై దృష్టిసారించడం లేదు. దీనికి తోడు నిధుల సమస్యలతో వారు పనుల విషయంలో వెనుకాడుతున్నారు.

**ఆర్థికభారం..**

డ్రింకింగ్ వాటర్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఈనెల 7నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ట్యాంక్‌ల శుభ్రం, బోర్ల మరమ్మతులు, బావుల పూడికతీత, పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోతే ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటి సరఫరా చేసి సమస్య లేకుండా చూడాలని కార్యదర్శులను ఉన్నతాధికారులు ఆదేశించారు. కాగా నిధులు లేకపోవడంతో అప్పులు చేసి పనులు చేయించాల్సి వస్తోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత సర్పంచ్‌లకు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల బిల్లులు నిలిచిపోయాయని వారు చెబుతున్నారు. కొన్ని జీపీల్లో కార్మికుల వేతనాల కోసం చెక్ రాసి ఎస్టీఓలకు పంపినా క్లియర్ కావడం లేదని, ఖజానా ఖాళీగా ఉండడంతో ఆర్‌బీఐ క్లియరెన్స్ కావడం లేదని కార్యదర్శులు చెబుతున్నారు. స్పెషలాఫీసర్లు సహకరించడం లేదని కార్యదర్శులు అంటున్నారు. వారి మధ్య సమన్వయం లేకపోవడంతో కూడా ఇతర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

**ఆరు నెలలుగా రాని వేతనాలు..**

జీపీలకు వచ్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల్లో పదిశాతం కార్మికుల వేతనాలకు ఉపయోగించాలి. అయితే కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు నెలలుగా నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్‌ఎఫ్‌సీ)నిధులు కొన్ని నెలలుగా విడుదల కావడం లేదు. దీంతె చిన్న జీపీల్లో పని చేసే కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదు. పెద్ద జీపీల్లోని కార్మికులకు మూడు నెలల వేతనాలు రాలేదు. దీంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు ఎప్పుడు ఇచ్చేది కూడా అధికారులు చెప్పడం లేదని వాపోతున్నారు.

**చిన్న జీపీల్లో వేతనాలు విడుదల కాలేదు**

చిన్న జీపీల్లో నిధుల సమస్య ఉంది. దీంతో కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్ద జీపీల్లో ఎలాంటి సమస్య లేదు . కేవలం ట్రాక్టర్ల రెండు నెలల ఈఎంఐలు పెండింగ్‌లో ఉన్నాయి. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నిధులు విడుదల కాగానే అన్ని సమస్యలు తీరుతాయి.

- హరిప్రసాద్, డీపీఓ

# ఆందోళన బాట

- పాతపద్ధతిని కొనసాగించాలని అంగన్‌వాడీ ఆయాల డిమాండ్
- ప్రమోషన్లు, పోస్టుల భర్తీలో విద్యార్హతపై రగడ
- జిల్లాలో 302 హెల్పర్ పోస్టుల ఖాళీలు



సీఐటీయూ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఆయాలు(ఫైల్)

**మహబూబాబాద్:** ఐసీడీఎస్ అంగన్‌వాడీ ఆయాలు ఆందోళన బాటపట్టారు. ప్రమోషన్లు, పోస్టుల భర్తీలో ఇంటర్ విద్యార్హత ఉండాలని జీఓ విడుదల చేసిన నేపథ్యంలో వారు రోడ్డెక్కారు. సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని ప్రమోషన్లు ఇవ్వాలని, విద్యార్హత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పలు డిమాండ్లతో హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. వెనక్కి తీసుకోని యెడల ఆందోళనలు తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరిస్తున్నారు.

**అప్‌గ్రేడ్..**

జిల్లాలో 1,285 మెయిన్ కేంద్రాలు, 152 మినీ కేంద్రాలు ఉండేవి. కాగా ఆశాఖ మంత్రిగా సీతక్క బాధ్యతలు స్వీకరించిన తర్వాత మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ తొలి సంతకం చేశారు. దీంతో గత డిసెంబర్ ప్రక్రియనుచేశారు. మినీ అంగన్‌వాడీ టీచర్లకు ప్రమోషన్ ఇచ్చారు.

**ఆయా పోస్టుల భర్తీపై..**

152 కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 152ఆయా పోస్టుల భర్తీ చేయాల్సి ఉంది. నోటిఫికేషన్ కోసం సంబంధిత అధికారులు ఎదురు చూస్తున్నారు. కాగా అన్ని కలిపి జిల్లాలో 302 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాగా ఆయా ప్రమోషన్, ఆయా పోస్టుల భర్తీకి కూడా ఇంటర్ విద్యార్హత ఉండాలని ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో విద్యార్హతపై ఆయాలు రోడ్డెక్కారు. పదో తరగతితోనే ఆయాలకు ప్రమోషన్ ఇవ్వాలని, అలాగే కొత్తగా ఆయాలను భర్తీ చేయాలని ఆందోళన చేస్తున్నారు.

**పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలి**



పాత పద్ధతిలోనే హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలి. సీనియారిటీని పరిగణనలోకి టీచర్లుగా ప్రమోషన్ ఇవ్వాలి. ఆయా పోస్టులను కూడా విద్యార్హత ఇంటర్ కాకుండా పదో తరగతితో భర్తీ చేయాలి. ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తాం.

- ఆకుల రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

**జీఓ ప్రకారం అమలు చేస్తాం**

152 కేంద్రాలు అప్‌గ్రేడ్ కాగా ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్ విద్యార్హత ఉండాలి . పలు విషయాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. జీఓ ప్రకారమే ఆయాల ప్రమోషన్లు అమలు చేస్తున్నాం. నోటిఫికేషన్ రాగానే ఆయా పోస్టులను భర్తీ చేస్తాం.

- వరలక్ష్మి, డీడబ్ల్యూఓ

## శేషజీవితాన్ని ఆనందంగా గడపాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**మహబూబాబాద్ రూరల్:** పోలీస్‌శాఖలో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. పదవీ విరమణ పొందిన హోంగార్డు ఆఫీసర్ ఏ.సంజీవను ఎస్పీ ఆదివారం ఘనంగా సన్మానించారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమ ఆరోగ్యాలపై తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డు ఆఫీసర్ సంజీవను సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

## తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న డీపీఓ హరిప్రసాద్

**గూడూరు:** వేసవికాలంలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని డీపీఓ హరిప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగు నీటి సమస్యను తీర్చేందుకు గ్రామాల్లో పాడైన బోర్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ చంద్రమోహన్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

**దంతాలపల్లిలో ..**

**దంతాలపల్లి:** గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని డీపీఓ హరిప్రసాద్ అన్నారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించేందకు ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలన్నారు. మిషన్ భగీరథ ఈఈ ఇంట్రా కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ అనూష, మండల పంచాయతీ అధికారి అప్సర్‌పాషా ఉన్నారు.

**తొర్రూరులో..**

**తొర్రూరు రూరల్:** వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీపీఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ ఇంట్రా కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీఓ ఆఫీస్‌లో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలోనైనా తాగునీటి కొరత ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలోఎంపీఓ గౌస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**చిన్నగూడూరులో..**

**చిన్నగూడూరు:** వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని డీపీఓ హరిప్రసాద్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై ఆదివారం మండల అధికారులు, పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ ఇంట్రా కృష్ణారెడ్డి, డిప్యూటీ ఈఈ అనూష, ఏఈ విష్ణు, ఎంపీఓ యాకయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# కేజీబీవీలో మెరుగైన ఫలితాలు

- మూడేళ్లుగా పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత
- చిన్నవంగర కస్తూర్బా పాఠశాల ఘనత


**పెద్దవంగర:** మండలంలోని చిన్నవంగర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తోంది. మూడేళ్లుగా పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించి అందరిని ఆకర్షిస్తోంది. సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని పాఠశాల ఉపాధ్యాయినులు అంటున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనూ ఈ నెల 18నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా ప్రస్తుతం పాఠశాల నుంచి 38మంది విద్యార్థినులు పరీక్షలు రాయనున్నారు.

**ప్రత్యేక దృష్టి..**

చదువులో వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వారు ఏ సబెక్టులో వెనకబడ్డారో గమనించి అందులో ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు. తాము చెప్పిన పాఠాలు అర్థం కావడం లేదంటే ఒకటికి రెండు సార్లు అర్థమయ్యేలా చెబుతారు. వారికి సులభంగా అర్థమయ్యే రీతిలోనే బోధిస్తున్నారు.

**ప్రత్యేక తరగతుల నిర్వహణ..**

కేజీబీవీ గత మూడేళ్ల ఫలితాలు





ఉపాధ్యాయినులు షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాత రివిజన్ ఉంటుంది. అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం వేళలతో పాటు సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు టెస్టులు నిర్వహించి తాము చెప్పింది ఎంతవరకు అర్థమైందో అంచనా వేస్తున్నారు. మరింత ఉత్తమ బోధన చేసేందుకు ఉపాధ్యాయినులు కృషి చేస్తున్నారు.



చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాల

**ప్రణాళికతో చదివిస్తున్నాం..**



ప్రతి విద్యా సంవంత్సరం ప్రణాళికబద్ధంగా బోధిస్తున్నాం. సరైన సమయంలో సిలబస్ పూర్తి చేస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయినులు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతుల నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నాయి. ఈ ఏడాది అదే ఒరవడిని కొనసాగించి వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

- గంగారపు స్రవంతి ప్రత్యేక అధికారి, కేజీబీవీ చిన్నవంగర

# భక్తుల కోలాహలం

- మేడారానికి భారీగా భక్తులు
- వనదేవతలకు మొక్కుల చెల్లింపు
- వనభోజనాలకు వెళ్లిన పూజారులు

**ఎస్ఎస్‌తాడ్వాయి:** మేడారం సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చి జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించారు. అమ్మవార్లకు పుట్టువెంట్రుకలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, ఎత్తుబంగారం, పూలు, పండ్లు, చీరసారె, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. యాటలను, కోళ్లను అమ్మవార్లకు మొక్కుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, తుడుందెబ్బ నాయకులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల రద్దీతో మేడారం గద్దెల ప్రాంగణం కోలాహలంగా కనిపించింది. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లో విడిది చేసి వంటవార్పు చేసుకుని సహపంక్తి భోజనలు చేశారు.

**వనభోజనాలకు..**

మేడారం సమ్మక్క పూజారులు, స్థానిక ఆదివాసీలు వనభోజనాలకు వెళ్లారు. మహాజాతర ముగిసిన తర్వాత తిరుగువారం పండుగ అనంతరం పూజారుల కుటుంబాలు, స్థానిక ఆదివాసీలు వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం పూజారులు గ్రామంలోని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమ్మక్క ప్రధాన పూజారి వడ్డె కొక్కెర కృష్ణయ్య, పూజారులు పసుపు, కుంకుమలు తీసుకుని గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి డప్పుచప్పులతో వనభోజనాలకు వెళ్లారు. గ్రామ పొలిమేర సమీపంలో పచ్చని పందిరి వేశారు. పందిరి కింద పోచమ్మ గద్దెను మట్టితో వేసి ఆడపడుచులు పసుపు, కుంకుమలతో అలకరించారు. అనంతరం పూజారులు దూపదీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు, పోచమ్మతల్లి చల్లంగా చూడాలని వేడుకున్నారు. పూజారుల కుటుంబీలు, స్థానిక ఆదివాసీలు వనంలో చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు. పూజారులు, స్థానిక ఆదివాసీలు కుటుంబసమేతంగా వనభోజనాలకు వెళ్లడంతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్దబోయిన మునిందర్, వసంతరావు, భోజరావు, నితిన్, మల్లెల ముత్తయ్య, జనార్దన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు



యాటను మొక్కుతున్న భక్తులు

**మేడారానికి చేరిన హుండీలు**

మేడారం మహాజాతరలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను లెక్కించేందుకు హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపానికి తీసుకెళ్లిన హుండీలను దేవాదాయశాఖ అధికారులు ఆదివారం మేడారానికి తీసుకొచ్చారు. అమ్మవార్ల కానుకల హుండీలను లెక్కింపు ప్రక్రియ పూర్తవ్వడంతో తిరిగి హుండీలను అధికారులు మేడారానికి తరలించారు. ఈ సందర్భంగా మేడారానికి భక్తులు ఆదివారం భారీగా తరలిరావడంతో దేవాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ మధు, రమాదేవిలు దగ్గరుండి భక్తులకు సేవలందించారు.

## సీపీఎస్‌ను రద్దు చేయాలి

**మహబూబాబాద్ అర్బన్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు డి.హరినాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ బాకాయిలు, నాలుగు పెండింగ్ డీఏలను పార్లమెంట్ ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు విడుదల చేయాలన్నారు. మధ్యలోనే ఆగిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. ఎంఈఓ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసి, విద్యావ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఏసీ గదుల్లో కూర్చునే ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించి, రైతులకు రైతుబంధు ఇవ్వకుండా ఆపడం సరికాదని వ్యాఖ్యానించిన మాజీ మంత్రి హరీశ్‌రావు తన మాటలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కుమార్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, కార్యదర్శులు ప్రసాద్, వీరస్వామి, మైసయ్య, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరినాయక్

# వరంగల్ మీదుగా మరో 'వందేభారత్'

**కాశిబుగ్గ :** వరంగల్ మీదుగా సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం(రేపు) నుంచి నడవనుంది. దీనిని దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా సికింద్రాబాద్ నుంచి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం ఇదే మార్గంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తుండగా ప్రయాణికుల సౌకర్యార్థం మరో రైలును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. ఈ రైలు గురువారం మినహా వారంలో 6 రోజులు నడుస్తుందని, 7 ఏసీ చైర్‌కార్ కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ ఏసీ చైర్‌కార్‌తో మొత్తం 8 కోచ్‌లు కలిగి 530 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. టికెట్ల బుకింగ్ ఈనెల 12 నుంచి అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ రైలు(20707) సికింద్రాబాద్ నుంచి ఉదయం 5.05 గంటలకు ప్రారంభమై 6.39కి వరంగల్‌కు చేరుకుంటుంది. 6.40కి ఇక్కడి నుంచి ప్రారంభమై 7.43 గంటలకు ఖమ్మం, 9.05 గంటలకు విజయవాడ, 11.00 గంటలకు రాజమండ్రి, 11.43కు సామర్లకోట, మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం చేరకుంటుంది. తిరిగి అదే రైలు(20708) విశాఖపట్నంలో మధ్యాహ్నం 14.35(2.35) గంటలకు బయలుదేరి 21.03 గంటలకు వరంగల్‌కు, రాత్రి 23.20 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుంది.

## క్లుప్తంగా

### వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కమ్మరిగూడెంలో తాటిచెట్టు మీద పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కమ్మరిగూడేనికి చెందిన సబక సర్వేశ్వర్‌రావు గ్రామ సమీపంలోని తన వ్యవసాయ భూమిలో ఉన్న తాటిచెట్లను జేసీబీ సాయంతో తొలగించి చేను శుభ్రం చేసుకుంటున్నాడని తెలిపారు. జేసీబీతో తాటిచెట్టును తొలగిస్తున్న క్రమంలో చెట్టుకు కొంతదూరంలో సర్వేశ్వరావు నిలబడి ఉన్నాడన్నారు. జేసీ బీ తాటిచెట్టును కింద పడేస్తుండగా చెట్టుకొమ్మలు సర్వేశ్వరావుపై పడ్డాయని తెలిపారు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు ఆటోలో చికిత్స నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యకోసం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌పై పెట్రోల్ బంక్ జంక్షన్‌లో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యకోటకు చెందిన మొగిలిచెర్ల శ్రీకాంత్(40) తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో హుటాహుటిన ఎంజీఎంకు తరలించారు. అతడి పరిస్థితి విషంగానే ఉందని తెలిసింది. అలాగే ఆదివారం సాయంత్రం గిర్మాజీపేటకు చెందిన కాసర్ల రాంబాబు కుమార్తె నీరజ, కుమారుడు గణేష్ బైక్‌పై రంగశాయిపేట నుంచి వరంగల్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో నాగమయ్య కమాన్‌దాటగానే వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ఘటనలో నీరజ, గణేష్‌కు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ పి.మల్లయ్య స్పందించారు. క్షతగాత్రులను తన వాహనంలో ఎంజీఎంకు తరలించే ప్రయత్నం చేస్తుండగా సమయానికి చేరిన 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు.

### కల్తీ పెట్రోల్‌పై వాహనదారుల ఆందోళన

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ శివారులోని కనకదుర్గ పెట్రోల్‌బంకులో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని వాహనదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. కంఠాత్మకూర్‌కు చెందిన అభిరానందన్ తన బైక్‌లో పెట్రోల్ పోసుకొని కొద్ది దూరం వెళ్లగా, బైక్ మొరాయించడంతో అనుమానం వచ్చి మెకానిక్ వద్ద బైక్‌ను చూపించాడు. బాటిల్‌లో పెట్రోల్ తీసి చూడగా పెట్రోల్ కల్తీ అయినట్లు గుర్తించి వెంటనే పెట్రోల్‌బంకు సిబ్బందికి చూపించి నిలదీశారు. అనంతరం బంకు వద్ద ఆందోళన చేపట్టాడు. పెట్రోల్ బంకుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



# వరప్రదాయిని ఫాతిమామాత

**నేడు ఉత్సవాలు ప్రారంభం**
- 71వ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- 11, 12, 13తేదీల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి
- వివిధ జిల్లాల నుంచి భక్తుల రాక



విద్యుత్ కాంతులతో ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చి

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు తల్లిగా ఫాతిమామాత భక్తుల వరప్రదాయినిగా గ్రేటర్ వరంగల్‌లో కాజీపేట ఫాతిమానగర్‌లోని కేథడ్రల్ చర్చిలో విరాజిల్లుతోంది. మేత్రాసన పీఠాధిపతి బిషప్ ఉడుములబాల ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో 71వ ఫాతిమామాత వేడుకలు వైభవంగా జరుగనున్నాయని తెలిపారు. ఓరుగల్లు డయాసిస్ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసిందని బిషప్ సెక్రటరీ ఫాదర్ అనుకిరణ్ వెల్లడించారు. తెలంగాణలో సుమారు 12జిల్లాల(మేత్రాసనం పీఠాధిపతి పరిధి) నుంచి భక్తులు రానున్నారని, చర్చిని, ఫాతిమామాత గుహను విద్యుత్ కాంతులతో అలంకరించి, ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

**నవదిన ప్రార్థనలతో ప్రారంభం**


ఈ నెల 3న ఫాతిమా ఫీస్ట్ ఉత్సవాలను నవదిన ప్రార్థనలతో ఓరుగల్లు మేత్రాసం పీఠాధిపతి డాక్టర్ ఉడుములబాల ప్రారంభించారు. 12వ తేదీ సాయంత్రం ఫాతిమానగర్ పురవీధుల్లో ఫాతిమా మాత స్వరూపంతో ఊరేగింపు మహా రథ ప్రదక్షిణ, కొవ్వొత్తులతో దివ్యప్రసాద ప్రదక్షిణ-దివ్య ప్రసాద ఆశీర్వాదంతో ముగింపు ఉంటుంది. ఉత్సవాల్లో హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల అంథోని ముఖ్య అతిథిగా పాల్గొంటారని కమిటీ బాధ్యులు వెల్లడించారు.

**ఫాతిమా చర్చికి ఘన చరిత్ర**

1949లో ఆనాటి హైదరాబాద్ వికార్ మోన్సిగ్నోర్ అల్ఫోన్స్ బెరెట్టా వరంగల్ మేత్రాసనం ఏర్పాటుకు అనేక ప్రయత్నాల అనంతరం ప్రస్తుత ఫాతిమానగర్ స్థలం 71ఎకరాలు కొనుగోలు చేశారు. ఆనాటి ప్రభుత్వం మేత్రాసనం భవన నిర్మాణానికి అనుమతి నిరాకరించారు. ఈ క్రమంలో బిషప్ బెరెట్టా సతమతమవుతున్న క్రమంలో పోర్చుగీసు దేశం నుంచి ఫాతిమామాత స్వరూపం హైదరాబాద్‌కు 1960 మే 14వ తేదీన తీసుకొచ్చారు. ఫాతిమా మాత స్వరూపం వద్ద బిషప్ బెరెట్టా ప్రార్థనలు చేయగా ఆటంకాలు తొలగిపోయాయి. 1961 జనవరి 14న ఓరుగల్లు పీఠాధిపతుల నిలయానికి శంకుస్థాపన చేశారు. బిషప్ బెరెట్టా అనుమతితో ఈ ప్రాంతానికి బ్రదర్ సాలా ఫాతిమానగర్ అని నామకరణం చేసి ఈ మేత్రాసనాన్ని ఫాతిమా తల్లికి అంకితమిచ్చారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం ఫాతిమానగర్‌గా ఫాతిమామాత దేవాయలంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

**అద్భుత రాతి కట్టడం**

1956లో బిషప్ బెరెట్టా ఫాతిమామాత పేరుమీద కేథడ్రల్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి బ్రదర్ సాలాకు నిర్మాణ పనులు అప్పగించారు. ములుగు ప్రాంతం నుంచి ప్రత్యేక రాతిని తెప్పించి సుమారు 6సంవత్సరాలపాటు శ్రమించి కట్టడాన్ని నిర్మించారు. 1962 మార్చి 13న బిషప్ బెరెట్టా ఫాతిమా మాత దేవాలయాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రార్థనలు, పండుగలకు నిలయం. క్రీస్తు తల్లి ఫాతిమామాత విన్నప ప్రార్థనల ద్వారా దేవుడు ఈ మేత్రాసనంపై ఎంతో మేళ్లను, అనుగ్రహాలను కురిపిస్తున్నారని భక్తుల విశ్వాసం. ఫాతిమామాత గౌరవార్థం మేత్రాసన స్థాయిలో ప్రతి ఏటా మతాలకు అతీతంగా పండుగాలు జరుగుతున్నాయి.



విద్యుత్ కాంతులతో అలంకరించిన ఫాతిమామాత గుహ

**గుహ ప్రత్యేక ముస్తాబు**

ఫాతిమా ఉత్సవాలకు ఫాతిమామాత గుహను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల ముగింపు వరకు భక్తులు గుహ వద్ద కొబ్బరి కాయలు, క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేసి తమ కోర్కెలు తీర్చమని వేడుకుంటారు.

# టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశాం



కేయూలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, సురేఖ, సీతక్క తదితరులు

**నిరుద్యోగులను విస్మరించిన బీఆర్ఎస్**
- కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి..
- కేయూలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క

కేయూ క్యాంపస్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో యూనివర్సిటీల్లోని యువత కీలకపాత్ర పోషించారని, పదేళ్లలో గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను విస్మరించిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని రాష్ట్ర మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన మంత్రులు దనసరి అనసూయ(సీతక్క), కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులతో మంత్రి పొంగులేటి కలిసి కే హబ్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కే హబ్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మార్పురావాలి ప్రజాపాలన రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు. వారు కోరుకున్నట్లుగానే ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. ఈనెల 11న భద్రాచలం రాముడి పాదాల వద్దనుంచే అర్హులైన లబ్ధిదారుల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు పొంగులేటి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే అప్పటి టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి అర్హులైనవారిని టీఎస్‌పీఎస్సీలో నియమించిందన్నారు. రాష్ట్రంలో 2లక్షలు ఉద్యోగాల ఖాళీ ఉన్నట్లు గుర్తించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 70రోజుల్లోనే 31వేల ఉద్యోగాలు భర్తీచేశారన్నారు. అలాగే టీఎస్‌పీఎస్సీ ద్వారా పలు నోటిఫికేషన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 11,062వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. కేయూలో పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులరైజ్ కావాలని, ఉద్యోగ భద్రత కావాలని తమకు విన్నవించారని.. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో గత ప్రభుత్వంలోని మంత్రులెవరు కేయూలోకి రాలేదని తెలిపారు. యూనివర్సిటీలో రూ.14 కోట్ల విలువచేసే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, బిల్డింగ్ డివిజన్ అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హేమలత, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ గాదె దయాకర్ పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 13 మంది అరెస్ట్, నాలుగు కార్లు స్వాధీనం
- రూ.1.26 లక్షల నగదు పట్టివేత

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేటకు చెందిన వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద శనివారం రాత్రి పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో.. ఏసీపీ మధుసూదన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, ఎస్సై శరత్‌తోపాటు బృందం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆలేరు, భువనగిరి, పెంబర్తి, జనగామ, సిరిపురం గ్రామాలకు చెందిన 13 మందిని పట్టుకున్నారు. వారి నుంచి 12 సెల్‌ఫోన్‌లు రూ.1.26 లక్షల నగదు, నాలుగు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

# పెరిగిన విద్యుత్ వినియోగం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: వినియోగదారులకు అంతరాయాలు లేకుండా మెరుగైన, సరఫరాతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 15,623 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు రికార్డు నమోదైందని, 303.6 మిలియన్ యూనిట్ల మైలురాయిని చేరుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 2022-23 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరితో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్‌డౌన్స్ 506 ఉండగా.. 2023-24 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో కేవలం 313 మాత్రమే అయ్యాయని, 38 శాతం బ్రేక్ డౌన్స్ తగ్గాయని వివరించారు. అలాగే 33 కేవీ ట్రిప్పింగ్స్ 14 శాతం, ట్రాన్స్‌ఫార్మర్‌ల వైఫల్యాలు 25 శాతం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు 23 శాతం తగ్గాయన్నారు. జంపర్లను సరిచేస్తూ.. ఒరిగిన స్తంభాలను సరిచేస్తూ.. 200 ఫీడర్లపై కెపాసిటర్ బ్యాంకులను అమర్చి 530 ఫీడర్లలో పవర్ ఫాక్టర్‌ను నిర్వహించడం ద్వారా లోవోల్టేజీ సమస్యను నివారించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని, వేసవిలోనూ దీనిని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

# అనుమతి లేనిదే లోనికి రావొద్దు

- కానిస్టేబుల్, విద్యార్థి తండ్రి మధ్య వాగ్వాదం
- ధర్నా చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

మహబూబాబాద్ అర్బన్: ఓ విద్యార్థి పెన్నులు మర్చిపోయి పరీక్షహాల్‌లోకి వెళ్లడంతో విద్యార్థి తండ్రి కృష్ణ పరీక్ష కేంద్రంలోకి వెళ్లి పెన్నులు ఇచ్చే క్రమంలో అనుమతి లేనిది లోపలికి రావొద్దని, విద్యార్థి తండ్రిని పోలీసు కానిస్టేబుల్ ఆపాడు. దీంతో కానిస్టేబుల్, కృష్ణకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిన ఘటన మానుకోట జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదుట జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సైనిక్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్న క్రమంలో ఓ విద్యార్థి పెన్నులు మరిచిపోయి పరీక్ష కేంద్రంలోకి వెళ్లాడు. దీంతో విద్యార్థి తండ్రి కేంద్రంలోకి వెళ్లి పెన్నులు ఇచ్చే క్రమంలో కానిస్టేబుల్ విద్యార్థి తండ్రి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో కానిస్టేబుల్.. కృష్ణపై చేయి చేసుకున్నాడని తెలిసి.. తల్లిదండ్రులు ఒక్కసారిగా కానిస్టేబుల్ దేవేందర్‌పై దాడి చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లే తమ కుమారుడు పెన్నులు మర్చిపోవడంతో ఇచ్చే క్రమంలో కృష్ణపై కానిస్టేబుల్ చేయి చేసుకున్నాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో కృష్ణ డబ్బులు, సెల్‌ఫోన్ పోయినట్లు తెలిపారు. అకారణంగా చేయి చేసుకోవడంతో.. చేయి చేసుకున్నామే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదన్నారు. కానిస్టేబుల్ దురుసుప్రవర్తనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. కాగా, ఈఘటనలో కృష్ణ, మోహన్, వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ దేవేందర్ వెల్లడించారు.

# క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతుంది



విజేతగా నిలిచిన క్రీడాకారులతో నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ, ఏకశిలా యూత్ బాధ్యులు

- జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ
- ముగిసిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్

మామునూరు : క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహభావం, పోటీతత్వం, క్రమశిక్షణే పెంపొందుతాయిన జవహార్ నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ అన్నారు. ఖిలావరంగల్ మండలం తిమ్మాపురంలోని క్రీడామైదానంలో ఏకశిలా యూత్ అసోసియేషన్, లైబ్రరీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బ్యాడ్మింటన్ నేషనల్ క్రీడాకారుడు కల్లెపు సురేందర్ ఆధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యువత అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను ప్రభుత్వ గుర్తించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన క్రీడాకారులు కోకొల్లలుగా ఉన్నారని గుర్తుచేశారు. అనంతరం వరంగల్ ఎంగ్‌స్టార్స్ ప్రథమ, తిమ్మాపురం ద్వితీయ, షాద్‌నగర్ మహబూబ్‌నగర్ తృతీయ, బీహెచ్‌ఎల్ మెదక్ నాలుగో స్థానంలో నిలిచింది. ఈ జట్లకు నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ చేతులమీదుగా విజేతలకు మెమోంటోలు, నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. నేషనల్ ప్లేయర్ బొల్లు యాకయ్య, మేకల సూరయ్య, బీరం రాంరెడ్డి, దశరథం, మాచర్ల రమేష్, బిక్షపతి పాల్గొన్నారు.

# అప్పు తెచ్చిన డబ్బు అగ్గిపాలు

- విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం
- కాలిపోయిన బంగారం, వెండి, నగదు

దుగ్గొండి: ఇల్లు నిర్మాణంతోపాటు, వరకట్నంగా ఇచ్చేందుకు అప్పుగా తీసుకున్న డబ్బులు అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈప్రమాదంతో రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గిర్నిబావి గ్రామానికి చెందిన రాయపురి నర్సయ్య ఇంటి నిర్మాణం చేసుకుంటున్న క్రమంలో పక్కనే పూరిగుడిసె వేసుకుని అందులో నివాసం ఉంటున్నాడు. వేసవి కాలం కావడంతో గుడిసె ముందర ఖాళీ స్థలంలో శనివారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగి మంటలు లేచి గుడిసె అంటుకుంది. మంటలు ఎక్కువ కావడం, గుడిసెలోని ఫ్రిడ్జిలోని గ్యాస్ పేలిపోయి భారీ శబ్దం రావడంతో మేల్కొన్న నర్సయ్య కుటుంబ సభ్యులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలి పోయింది. ఇంటి నిర్మాణం కోసం అప్పు తెచ్చుకున్న డబ్బులతోపాటు, బిడ్డ పెళ్లి సందర్భంగా అల్లుడికి ఇవ్వాల్సిన డబ్బుల కోసం అప్పు తెచ్చి రూ.4లక్షలు కాలిపోయాయి. నోట్ల కట్టలు సగం కాలిపోగా 4తులాల బంగారు, 100తులాల వెండి కాలిపోయింది. ఇంట్లోని ఫ్రిడ్జి, టీవీ, ఫ్యాన్, బీరువాలు, వాటిలోని దుస్తులు, వస్తువులన్నీ బూడిదయ్యాయి. కట్టుబట్టలు తప్ప ఏమీలేకుండా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై జక్కుల పరమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, బాధితుడిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఓదార్చారు. వివరాలు అడిగి తెలుసుకున్నాడు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



కాలిబూడిదైన పూరి గుడిసె



మంటల్లో కాలిపోయిన నగదు

### ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఎల్కతుర్తి: ఓ హోటల్లో పనిచేస్తున్న వర్కర్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ధర్మసాగర్ మండలం దేవునూర్‌కు చెందిన గాజుల కోటి(50) తన ఫ్యామిలీకి దూరంగా ఉంటున్నాడు. 40 రోజుల క్రితం ఎల్కతుర్తికి వచ్చి హోటల్‌లో పనిచేస్తానని హోటల్ యజమాని శ్రీధర్‌ను అడుగగా పనిలో పెట్టుకున్నాడు. హోటల్ నడవకపోవడంతో గత పది రోజులుగా హోటల్ బంద్ పెట్టాడు. ఇంటికి వెళ్లమని యజమాని కోటికి చెప్పగా ఇక్కడే ఉంటానని చెప్పడంతో సరే ఉండమని చెప్పాడు. దీంతో హోటల్‌లోనే తిని పడుకుంటున్నాడు. ఆదివారం యజమాని కుమారుడు గ్యాస్ కోసం హోటల్‌కు వచ్చి వెతుకుతుండగా చీకటిగదిలో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసలు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

### అనారోగ్యంతో మహిళ..

పలిమెల: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై తమాషారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పలిమెలకు చెందిన జనగామ లక్ష్మి (55) నాలుగేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనారోగ్య తీవ్రతను తట్టుకోలేక ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు జనగామ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధుడి..

కాశిబుగ్గ : రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్-కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య మేఘన బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న రైల్వేట్రాక్‌పై ఆదివారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. మృతుడు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు, 5.3 ఎత్తు చామనఛాయ గుండ్రని ముఖం కలిగి చాతిపై కుడి పక్క పుట్టుమచ్చ ఉందన్నారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే హెడ్‌కానిస్టేబుల్ కె.భాస్కర్‌ను లేదా 9440361941, 8712658585 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

# బాలుడి కిడ్నాప్ కలకలం!

- రెండు గంటల తర్వాత ప్రత్యక్షం
- ఊపిరి పీల్చుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు

జనగామ: జనగామ పట్టణం ప్రెస్టన్ మైదానంలో పతంగి ఎగుర వేస్తున్న ఓ బాలుడి కిడ్నాప్ కలకలం టెన్షన్ పెట్టించింది. పల్సర్ బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని ప్రత్యక్ష సాక్షులు తెలుపడంతో పోలీసులు అలర్టయ్యారు. కొడుకు ఇంటికి రాలేదని తల్లిదండ్రులు.. కాలనీ వాసులు పోలీస్‌స్టేషన్‌కు రాగా... ఎస్సై సృజన్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మధ్యాహ్నం 1.48 నిమిషాలకు బాలుడు మాయమైనట్లు ప్రచారం జరగ్గా.. పోలీసులు ప్రెస్టెన్, సూర్యపేట రోడ్డు, ఆర్టీసీ చౌరస్తా తదితర ఏరియాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న క్రమంలో మధ్యాహ్నం 3.40 నిమిషాలకు బాలుడు ఇంటికి చేరుకున్నట్లు పోలీసులు సమాచారం అందుకున్నారు. బాలుడిని కంట్రోల్ రూంకు తీసుకొచ్చి, కిడ్నాప్‌కు సంబంధించి ఎస్సై సృజన్ బాలుడితో మాట్లాడారు. ప్రెస్టన్ మైదానంలో ఆడుకుంటున్న సమయంలో తెలిసిన వారితో బైక్‌పై ఇంటికి వెళ్లి, అక్కడ నుంచి దుకాణం వెళ్లి రావడంతో ఆలస్యమైనట్లు చెప్పాడు. దీంతో అప్పటి వరకు టెన్షన్‌గా ఉన్న పోలీసులు.. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న ఎస్సై సృజన్

# వ్యవసాయబావిలో పడి రైతు మృతి

కేసముద్రం: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారిపడి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని ధన్నసరి గ్రామశివారు రేకులతండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం..తండాకు చెందిన కేలోత్ వెంకన్న (40) తన భార్య, ఇద్దరు కుమారులను ఇదే గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లిరండని చెప్పాడు. పంటపొలానికి మందు కొట్టి వస్తానని చెప్పి పంటచేను వద్దకు వెళ్లాడు. ఇంతలో గుడికి వెళ్లి భార్య, కుమారులు తిరిగి ఇంటికి వచ్చారు. అప్పటి వరకు వెంకన్న ఇంటికి రాకపోవడంతో చిన్నకుమారుడు వ్యవసాయబావి వద్దకు వెళ్లి చూడగా బావిలో తండ్రి పడి ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు, తండావాసులు వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బావి వద్దకు వెళ్లిన వెంకన్న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారిపడగా బావిలో నీళ్ల తక్కువగా ఉండటంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వెంకన్న మృతదేహం

### ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం

- ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా వాసుల మృతి

ఖమ్మంరూరల్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ఇద్దరు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఖమ్మంరూరల్ మండలానికి చెందిన ఈగ రాజిరెడ్డి (37), మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన షేక్ షబ్బీర్ (35) కలిసి గ్రానైట్ వ్యాపారం చేస్తున్నారు. వారం రోజుల క్రితం వీరు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఓ గ్రానైట్ క్వారీ నుంచి రాయిని తీసుకుని ఖమ్మం వస్తుండగా మార్గమధ్యలో మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పింది. ఈ క్రమంలో గ్రానైట్ రాళ్లు క్యాబిన్‌పై పడటంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా షబ్బీర్ ఐదేళ్లుగా వరంగల్‌క్రాస్‌రోడ్డులో కుటుంబంతో నివాసముంటున్నాడు. రాజిరెడ్డి ఖమ్మం నగరంలోని సారథినగర్‌వాసి.



రాజిరెడ్డి (ఫైల్)



ఎస్‌కే షబ్బీర్ (ఫైల్)